# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in
ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం
తెలుగు దిన పత్రిక

సంపుటి : 03 సంచిక : 145 మంగళవారం 10-03-2026 పేజీలు : 4 వెల : 2/-



క్రైం కౌంటర్ News
ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలంగాణ సూర్యాపేట్ జిల్లా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

రిపోర్టర్లు కావలెను

- జిల్లా బ్యూరోలు
- నియోజక వర్గ ఇన్చార్జీలు

Contact No: 98497 07349


# ఇన్సూరెన్స్ కట్టించి.. హత్య చేయించిన భార్య



ఖమ్మం జిల్లాలో అమానుష ఘటన వెలుగుచూసింది. ఓ భార్య కట్టుకున్న భర్తను చంపేసింది. మద్యానికి బానిసై ఇబ్బందులకు గురి చేయటంతో పాటు తరుచూ అనారోగ్యానికి గురవుతున్నాడనే నెపంతో ఇన్సూరెన్స్ చేయించి మరీ కడతేర్చింది. బంధవు సాయంతో చంపించి.. రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నించింది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నలుగురు నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. పవిత్రమైన వివాహ బంధానికి మచ్చుతెచ్చే ఘటన ఖమ్మం జిల్లాలో వెలుగుచూసింది. మద్యానికి బానిసైన భర్తను.. ఇన్సూరెన్స్ చేయించి మరీ హత్య చేయించిందో భార్య. భర్త అనారోగ్యానికి గురికావటం, ఏడాదైనా చనిపోకపోవటంతో బంధువు సాయంతో యాక్సిడెంట్ చేయించి ప్రాణాలు తీసింది. భార్య ప్రవర్తనపై అనుమానం రావటంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణలో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఖమ్మం రూరల్ పోలీసులు ఆదివారం (మార్చి 8) ఈ కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. మార్చి 2న ఖమ్మం గ్రామీణ మండలం ఎంవీపాలెం సమీపంలోని ఖమ్మం-కురవి ప్రధాన రోడ్డు పక్కన ఓ గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గవర్నమెంట్ హాస్పిటల్‌కు తరలించారు. చనిపోయిన వ్యక్తిని ఖమ్మం నగరం గాంధీనగర్ ప్రాంతానికి చెందిన చాగంటి రవిగా పోలీసులు గుర్తించారు. వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న కుటుంబసభ్యులు, బంధువులు రవి మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. ప్రధానంగా రవి భార్య చాగంటి ప్రశాంతితోపాటు సమీప బంధువు దేశపోయిన శ్రీనివాస్‌పై అనుమానం ఉన్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వెల్లడించారు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టగా విస్తుగొలిపే విషయాలు వెలుగులోకి వచ్చాయి. రవి భార్య ప్రశాంతినే ఈ హత్య చేయించినట్లు విచారణలో తేలింది. రవి, ప్రశాంతికి ఇరవై ఏళ్ల క్రితం వివాహం జరగ్గా.. వీరికి ఇద్దరు సంతానం. అయితే ఆటో డ్రైవర్‌గా పని చేసే రవి.. మద్యానికి బానిసయ్యాడు. దానికి తోడు అనారోగ్యానికి గురై నిత్యం భార్యతో గొడవపడేవాడు. తన భర్త అనారోగ్య పరిస్థితి దృష్ట్యా ఎంతో ఎక్కువ కాలం బతకడని డిసైడ్ అయిన భార్య ప్రశాంతి అతడి పేరిట ఇన్సూరెన్స్ చేయించింది. అయితే ఏడాది గడిచినా రవి చనిపోకపోవటంతో అతడ్ని మట్టుపెట్టాలని భావించింది. అందుకు రవికి వరసకు బావమరిది అయ్యే దేశపోయిన శ్రీనివాస్ సాయం తీసుకుంది. రవిని హత్య చేసి రోడ్డు యాక్సిడెంట్‌గా అందర్ని నమ్మించాలని ప్రశాంతి, శ్రీనివాస్ డిసైడ్ అయ్యారు. ఈ క్రమంలోనే ఈనెల 2న తన ఆటోలో రవిని శ్రీనివాస్ బయటకు తీసుకెళ్లాడు. మార్గం మధ్యలో మద్యం తాగించి ఖమ్మం గ్రామీణ మండలం ఎంవీపాలెం శివారు ప్రాంతంలో రవిని వదిలేసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. మద్యం మత్తులో అక్కడే తూలుతూ తిరుగుతున్న రవిని ప్లాన్ ప్రకారం.. జోగి వెంకటేష్ అనే వ్యక్తికి చెందిన కారుతో జోగి రాజ్ కుమార్ అనే మరో వ్యక్తి కారును వేగంగా నడుపుతూ వెనక నుంచి ఢీకొట్టి చంపేశాడు. రవి హత్యకు చిలుక్కాయలపాడుకు చెందిన జోగి రాంబాబు సైతం సహకరించాడు. ఈ మేరకు నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రశాంతి ప్రస్తుతం పరారీలో ఉండగా.. త్వరలోనే ఆమెను అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.

## కోదాడ ఎమ్మెల్యే శ్రీమతి ఉత్తమ్ పద్మావతి రెడ్డి గారిని కలిసి వినతి పత్రం అందించిన



ఐ.ఎన్. టి. యు. సి. అనుబంధ సంఘం రాష్ట్ర కార్యదర్శి బి. విజయలక్ష్మి.

క్రైం కౌంటర్ న్యూస్ కోదాడ, మార్చి 09 ( గురునాథం జిల్లా బ్యూరో)

సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం కోదాడ పట్టణ కేంద్రంలో ఐ ఎన్ టి యు సి అనుబంధ సంఘం ఆశ వర్కర్ల రాష్ట్ర అధ్యక్షులు మైముదా గారి ఆదేశానుసారం సోమవారం కోదాడ శాసన సభ్యురాలు శ్రీమతి ఉత్తమ్ పద్మావతి రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలసి రాష్ట్రవ్యాప్తంగా ఆశాలు ఎదుర్కొంటున్న సమస్యలను గూర్చి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి బి. విజయలక్ష్మి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆశలు ఎదుర్కొంటున్న సమస్యలు గూర్చి త్వరలో జరగబోయే అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించాలని, ఆశ వేతనాల సమస్య లు మరియు ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పెట్టిన మేనిఫెస్టో లో పేర్కొన్న విధంగా ఆశలకు నెలసరి 18 వేల రూపాయలు వేతనం అందించాలని, రెండు నెలలుగా నిలిపివేసిన జీతాలు వెంటనే విడుదల చేయాలని, కోరుకుంటూ వినతి పత్రాన్ని అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కోదాడ డివిజన్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## అతివేగం వలన ప్రాణాలు పోగొట్టుకున్న పరిస్థితి.





క్రైమ్ కౌంటర్ న్యూస్ అనంతగిరి, మార్చి 09 ( గురునాథం జిల్లా బ్యూరో )

సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం కోదాడ మండలం శాంతినగర్ శివారులో జరిగిన దుర్ఘటన. తేదీ. 08-03-2026 నాడు రాత్రి 11-30 గంటల సమయంలో ఖమ్మం మండలం, కొత్తగూడెం గ్రామానికి చెందిన మృతుడైన షేక్ మౌలానా తండ్రి సుభాన్ సాహెబ్, వయసు 45 సంవత్సరాలు, కులం: దూదేకుల, వృత్తి: సుతారి మేస్త్రి అను అతను నిన్నటి రోజు తన స్నేహితులైన అల్లి నరేష్ మరియు కొత్తపల్లి అశోక్లతో కలిసి టీఎస్ -04 ఎఫ్.కె -2731 నెంబర్ గల క్రెటా వాహనంపై జగ్గయ్యపేట ఫంక్షన్ కి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామ శివారులో గల ఎన్ హెచ్ -365 (ఏ) పై వెళ్తుండగా కారు నడుపుతున్నటువంటి కొత్తపల్లి అశోక్ తన కారుని అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం వలన కారు అదుపుతప్పి రోడ్డు పక్కన గల కల్వర్టుకు ఢీకొట్టగా ఇట్టి ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు గాయపడగా వారిని చికిత్స నిమిత్తం నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతునికి బలమైన గాయాలై చనిపోయినాడు. కారు నడుపుతున్న అశోక్ మరియు కారులో ప్రయాణిస్తున్నటువంటి నరేష్ లకు గాయాలై ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. మృతుని అక్క అయిన షేక్ హుస్సేన్ బి గారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినది. మృతునికి భార్య, ఒక కొడుకు, కూతురు ఉన్నారు.

## కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబును ఘనంగా సన్మానించిన కోదాడ డివిజన్ ఆశా కార్యకర్తలు.



క్రైం కౌంటర్ న్యూస్ కోదాడ, మార్చి 09 ( గురునాథం జిల్లా బ్యూరో )

సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం కోదాడ పట్టణ కేంద్రంలో ఐ.ఎన్. టి. యు. సి. అనుబంధ సంఘం కోదాడ అర్బన్ ఆశ కార్యకర్తల రాష్ట్ర కార్యదర్శి బి. విజయలక్ష్మి, కేజమ్మ ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కోదాడ డివిజన్ ఆశా కార్యకర్తలు కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తల రాష్ట్ర కార్యదర్శి బి.విజయలక్ష్మి మాట్లాడుతూ, ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ గా కావడం మా అదృష్టంగా భావిస్తూ, మా ఆశా వర్కర్ యొక్క సమస్యల పరిష్కారానికి ఎంతో తోడ్పాటు అందిస్తారని, దాదాపు 20 సంవత్సరాల నుండి పనిని బట్టి పారితోషం తీసుకొని చాలీ, చాలని జీతాలతో, మా స్థాయికి మించిన పని భారాన్ని మోసుకుంటూ ప్రజల యొక్క ఆరోగ్య దృష్ట్యా పసి పిల్లవాని నుండి మరియు బాలింతలు, పండు ముసలి అవ్వ తాత వరకు మాకు అప్పజెప్పిన బాధ్యతను బట్టి నిత్యం వారికి ఆరోగ్య సేవలు అందిస్తూ, ఎంతో కఠోరమైన జీవితాన్ని సాగిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నాము. కానీ ఎన్నో ప్రభుత్వాలు మారినా మా బ్రతుకులు మారలేదు. తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలనలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో మాకు మంచి జరుగుతుందని ఆశతో మన కోదాడ శాసన సభ్యురాలు అయిన శ్రీమతి ఉత్తమ్ పద్మావతి రెడ్డి ఆశీస్సులతో, మీ యొక్క సాయ సహకారాలతో ఇప్పటినుంచి అయినా మా జీవితాలు సజావుగా సాగుతాయని, సాగాలని, మాకు కష్టానికి ఫలితంగా తగిన జీతభత్యాలు మీ ద్వారా అందుతాయని, మీరు మా యొక్క పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని సుదీర్ఘ ఆలోచన చేసి మీరు మాకు పెద్దదిక్కుగా, మమ్ములను మీ తోబుట్టువులుగా భావించి ఈ సమాజంలో ఆర్థికంగా సామాజికంగా సాంఘికంగా మమ్మలను ఒక స్థాయిగా మీరు నిలబెడతారని, మీకు మరోసారి మా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ కోదాడ మున్సిపల్ పరిధిలో గల ప్రజానీకానికి మంచి సుపరిపాలన అందించాలని మా ఆశా కార్యకర్త తరపున కోరుతున్నామని అన్నారు. మరియు మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు ఆశల యొక్క పరిస్థితిని కళ్ళారా చూసి, చెవులార విని వెంటనే స్పందించి, చైర్ పర్సన్ కుసుమ గారు మాట్లాడుతూ, తప్పకుండా మా సాయి శక్తుల మీయొక్క డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానని, వారు సహృదయంతో వారిని కలిసిన ఆశా కార్యకర్తలను పేరు పేరునా శాలువాలతో సత్కరించి సన్మానించినారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల రాష్ట్ర కార్యదర్శి బి. విజయలక్ష్మి, కేజమ్మ, ఎస్కే ఆశ బి, కైరునిస, కే. శైలజ, అనంతలక్ష్మి, టి. కవిత, ఇ. రమణమ్మ, ఎల్. నాగలక్ష్మి, కే. పద్మ, జి. సైదమ్మ, కె. రాధా, తదితరులు పాల్గొన్నారు.

## సెక్యులరిజానికి కేరాఫ్ చిరునామా కాంగ్రెస్ పార్టీ.

- ఢిల్లీ నుండి గల్లీ వరకు ముస్లింలకు అండగా ఉండేది కాంగ్రెస్ పార్టీనే.
- సర్వమతాలను సమానంగా చూస్తాం.
- ముస్లింల రక్షణతో పాటు సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం.
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి.



క్రైం కౌంటర్ న్యూస్ కోదాడ, మార్చి 09 ( గురునాథం జిల్లా బ్యూరో )

ఢిల్లీ నుండి గల్లీ వరకు ముస్లింలకు అండగా నిలబడేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమే నని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

భారతదేశంలో సర్వమతాలను సమానంగా చూస్తూ వారి వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న పార్టీ కుడా కాంగ్రెస్ పార్టీ మాత్రమే నని ఆయన స్పష్టం చేశారు.

రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం సూర్యాపేట జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.

రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నేత సర్వోత్తం రెడ్డి,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి,మున్సిపల్ చైర్మన్ మోరిశెట్టి నివేదితా లక్షాది ,పిసిసి కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో సెక్యులరిజానికి పెద్ద పీట వేస్తున్నది కాంగ్రెస్ పార్టీ మాత్రమే నన్నారు.

లోకసభలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ మొదలు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి వరకు ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం పనిచేస్తుందని ఆయన చెప్పారు.

ఒక్క మాటలో చెప్పాలి అంటే సెక్యులరిజానికి కాంగ్రెస్ పార్టీ కేరాఫ్ చిరునామాగా నిలిచిందని ఆయన వ్యాఖ్యానించారు.

ముస్లింల రక్షణతో పాటు వారి వారి అభివృద్ధితో పాటు సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు పెద్ద పీట వేశాయని ఆయన గుర్తుచేశారు.

ముస్లింలు పవిత్ర మాసంగా భావించే రంజాన్ మాసంలో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొనడడం ఆనంద దాయకంగా ఉందన్నారు.

సూర్యాపేట లో ముస్లింల సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా మంత్రిగా నిరంతరం అందుబాటులో ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలో షాధిఖాన, కమ్యూనిటి హాల్,ఖబరస్తాన్ వంటి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

## తెలంగాణ మహిళా రైతులకు తీపికబురు..



రైతన్నల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో వ్యవసాయ రంగాన్ని పండుగలా మారుస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మహిళా రైతుల కోసం ప్రత్యేకంగా వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఆయన ప్రకటించారు. వ్యవసాయ రంగంలోనూ మహిళలు రాణించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. అన్నదాతలను ఆదుకునేందుకు అంకితభావంతో పనిచేస్తోందని పునరుద్ఘాటించారు. ఆదివారం (మార్చి 8) రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ వర్సిటీలో నిర్వహించిన రెండు రోజుల 'మెగా రైతు మేళా'లో మంత్రి తుమ్మల ప్రసంగించారు. రైతు సాధికారతే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా రుణమాఫీ చేసిందన్నారు. ఇప్పటివరకు దాదాపు 25 లక్షల మంది రైతులకు రూ. 21 వేల కోట్ల మేర పంట రుణాలను మాఫీ చేసిందని గుర్తుచేశారు. రైతు సంక్షేమ పథకాలను పునరుద్ధరించడం ద్వారా రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నామని అనారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలోనే మహిళా రైతుల కోసం 'వ్యవసాయ యాంత్రీకరణ' (అగ్రి మెకనైజేషన్) పథకాన్ని ప్రారంభించనున్నట్లు మంత్రి తుమ్మల కీలక ప్రకటన చేశారు. ఈ పథకం ద్వారా వ్యవసాయ రంగంలో మహిళపాత్రను బలోపేతం చేస్తామన్నారు. ఐక్యరాజ్యసమితి ప్రకటించిన 'అంతర్జాతీయ మహిళా రైతుల సంవత్సరం - 2026', అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల నేపథ్యంలో ఈ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మరో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రతి ఏడాది ఒకే రకమైన పంటలు కాకుండా పంటల మార్పిడి ద్వారా లాభసాటి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని సూచించారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఈ మేళా మహిళా రైతుల సాధికారతకు ఒక గొప్ప వేదిక అని అన్నారు. పీజేటీఎస్ఏయూ, కోరమాండల్ ఇంటర్నేషనల్, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఈ మేళాలో పెద్ద సంఖ్యలో మహిళా రైతులు పాల్గొన్నారు. ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన పెంచుకున్నారు. ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ ఎం.ఎల్. జాట్ సైతం తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయాభివృద్ధికి తీసుకుంటున్న చొరవను ప్రత్యేకంగా కొనియాడారు.

## తెలంగాణ రవాణాశాఖలో కొత్త పోస్టు..



తెలంగాణ రవాణాశాఖలో అధికారులకు పెరుగుతున్న పని ఒత్తిడిని తగ్గించేందుకు ప్రభుత్వం 'అదనపు కమిషనర్' అనే కొత్త పోస్టును ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కమిషనర్, జేటీసీల మధ్య వారధిగా ఉండే ఈ పోస్టు ప్రతిపాదన ప్రస్తుతం న్యాయశాఖ పరిశీలనలో ఉంది. దీంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పరిపాలనా విభాగాల్లోని ఖాళీలను భర్తీ చేసేందుకు రవాణాశాఖ కసరత్తు చేస్తోంది. తెలంగాణ రవాణాశాఖలో ప్రస్తుతం చాలా వరకు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రవాణాశాఖ కమిషనర్ తర్వాత జాయింట్ కమిషనర్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పరిపాలన విధులు, పర్యవేక్షణ బాధ్యతలు పెరుగుతుండటం అధికారులపై ఒత్తిడి పెంచుతోంది. దానికి తోడు రోడ్డు ప్రమాదాలు తగ్గించాలంటూ సుప్రీం కోర్టు కమిటీ నివేదించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు కొత్త పోస్టు ఏర్పాటు చేయాలని డిసైడ్ అయింది. కమిషనర్, జేటీసీల మధ్యలో అదనపు రవాణా కమిషనర్ పోస్టు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి రవాణాశాఖ ప్రతిపాదించింది. అందుకు సంబంధించిన ఫైల్ ప్రస్తుతం న్యాయశాఖ పరిశీలనలో ఉంది. సర్వీసు రూల్స్‌లో సవరణ చేసిన తర్వాత అదనపు కమిషనర్ పోస్టు ఏర్పాటు కానున్నట్లు సమాచారం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక ఇప్పటి వరకు రవాణాశాఖలో అదనపు కమిషనర్ పోస్టు ఏర్పాటుపై సర్కార్ దృష్టి సారించలేదు. పోస్టు ఆమోదం పొందితే సర్వీసు పరంగా సీనియర్ అధికారిగా ఉన్న హైదరాబాద్ జేటీసీ రమేష్‌కు అదనపు కమిషనర్ పోస్టు దక్కే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇవే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఏడు రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ ఆర్టీవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అసిస్టెంట్ సెక్రటరీ 1, మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్లు 13, అసిస్టెంట్ మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్లు 8, సీనియర్ అసిస్టెంట్లు 11, జూనియర్ అసిస్టెంట్లు 4, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయని రవాణాశాఖ ప్రభుత్వానికి వివరించింది. త్వరలోనే ఈ పోస్టులు కూడా భర్తీ చేయనున్నట్లు తెలిసింది. హైదరాబాద్ నగరంలో రోడ్డు యాక్సిడెంట్లు అరికట్టేందుకు, ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేసేందుకు నగర ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈనెల 1 నుంచి 7 వరకు నగర వ్యాప్తంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. తనిఖీల్లో భారీగా వాహనదారులు పట్టుబడ్డారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి మొత్తం 1940 కేసులు నమోదు చేశారు. మైనర్లకు, లైసెన్స్ లేని వ్యక్తులకు వాహనాలను ఇవ్వవద్దని ఈ సందర్భంగా పోలీసులు వాహన యజమానులకు విజ్ఞప్తి చేశారు.

## అనాథగా వదిలేసిన కొడుకులు..



నాడు రజాకార్లపై పోరాడి గెలిచిన 110 ఏళ్ల ఉంగరాల యాదగిరి నేడు కన్నకొడుకుల చేతిలో ఓడిపోయాడు. తనకున్న 50 ఎకరాల భూమిని, లక్షలాది రూపాయల నగదును కుమారులకు పంచిచ్చిన ఈ శతాధిక యోధుడిని.. ఆస్తి దక్కగానే కొడుకులు కొట్టి గెంటేశారు. ప్రస్తుతం ఉప్పల్‌లోని అనాథాశ్రమంలో తలదాచుకుంటున్న ఆయన.. తన భూమిని తిరిగి ఇప్పించి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన కొడుకులపై చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని కన్నీళ్లతో వేడుకుంటున్నారు. నాడు రజాకార్లతో పోరాడిన ఆయన.. కన్నకొడుకుల చేతిలో మాత్రం ఓడిపోయారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్న ఆయన ఇప్పుడు వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్నారు. 50 ఎకరాల భూమిని పంచి ఇచ్చినా.. కొడుకుల ఆప్యాయతను పొందలేకపోయారు. ఆయనే ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ఉంగరాల యాదగిరి . వలిగొండ గ్రామం కేశిపల్లికి చెందిన ఉంగరాల యాదగిరి(110) స్వాతంత్ర్య సమరయోధుడు. రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడారు. ఆ తర్వాత సొంత గ్రామంలో 50 ఎకరాలను కష్టపడి సంపాదించుకున్నారు. ఆయనకు భార్య, నలుగురు కుమారులు, ఇద్దరు కూతుర్లు సంతానం. భార్య లక్ష్మమ్మ పదిహేనేళ్ల క్రితం కాలం చేశారు. ఆ తర్వాత తనకున్న 50 ఎకరాల్లో నలుగురికి కుమారులకు తలో 10 ఎకరాల చొప్పున రిజిస్ట్రేషన్ చేశారు. మిగిలిన 10 ఎకరాల్లో కూతుళ్లకు చెరో ఐదెకరాల చొప్పున రాసిచ్చారు. కుమారుల ఇళ్ల నిర్మాణం కోసం రూ.25 లక్షలు కూడా ఇచ్చారు. అయితే ఆస్తులు పంచుకున్న తర్వాత కుమారులు యాదగిరిని పట్టించుకోవడం మానేశారు. యాదగిరి ఒంటిపై ఉన్న బంగారాన్ని కూడా లాగేసుకొని.. ఇంట్లో నుంచి బయటికి గెంటేశారు. దీంతో దిక్కుతోచని స్థితిలో అనాథగా మారిన యాదగిరిని కుమార్తెలు ఉప్పల్‌లోని ఓ వృద్ధాశ్రమంలో చేర్పించారు. చాలా కాలంగా ఆయన అక్కడే ఉంటున్నారు. తనను పట్టించుకోకుండా మానసిక క్షోభకు గురిచేస్తున్న కుమారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. అయినా సరే, ఆయన గోడు పట్టించుకునేవారే కరువయ్యారు. తన పరిస్థితిని అర్థం చేసుకుని కుమారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని ఈ పెద్దాయన వేడుకుంటున్నారు. తన నుంచి తీసుకున్న 40 ఎకరాల భూమి తాను బతికి ఉన్నంత వరకు తనకే చెందేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. యాదగిరి ఉదంతం ఒక్కటే కాదు.. ప్రస్తుత సమాజంలో ఇలాంటి ఘటనలు నిత్యకృత్యమవుతున్నాయి. ఆస్తుల కోసం కన్నవారినే రోడ్డున పడేస్తున్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చిన్నభిన్నమై, మనుషుల్లో వ్యక్తిగత స్వార్థం పెరిగిపోవడమే దీనికి ప్రధాన కారణమని మనస్తత్వ వేత్తలు చెబుతున్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి.



- బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి ప్రమాదాల నివారణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి.
- సూర్యాపేట జిల్లాలో డ్రగ్స్, మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి.
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్.

క్రైం కౌంటర్ న్యూస్ కోదాడ, మార్చి 09 ( గురునాథం జిల్లా బ్యూరో)

సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ లో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ (డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ- డీ.ఆర్.ఎస్.సీ) సమావేశం, డ్రగ్స్ నిర్మూలన పై సమీక్ష సమావేశం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు, డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు చేపట్టాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆర్ అండ్ బి, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా, పోలీస్, రవాణా, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్టీసీ, ఇతర శాఖల అధికారులతో రోడ్డు భద్రత కమిటీ సమావేశం (డిస్ట్రిక్ రోడ్ సేఫ్టీ కమిటీ- డి ఆర్ ఎస్ సి ) నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో సంవత్సరం నుండి తరచుగా ఎక్కడెక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి, బ్లాక్ స్పాట్స్ ని గుర్తించి ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు, ప్రమాదాల నివారణకు సైన్ బోర్డులు ఏర్పాటు చేశారా, జిల్లాలో ఎన్ని బ్లాక్ స్పాట్స్ ఉన్నాయి, గత కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలు, ఎన్ హెచ్ హైవేపై ఎన్ని పెట్రోలింగ్ వెహికల్స్ అందుబాటులో ఉన్నాయి, ఇప్పటివరకు ఎన్ని ఓవర్ లోడ్ వాహనాలపై కేసులు నమోదు చేశారు, ప్రైవేట్ పాఠశాలల బస్సులను తనిఖీ చేస్తున్నారా, తదితర రోడ్డు భద్రతకు సంబంధించిన అంశాలను సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిధిలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలు, ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ కు అధికారులు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్ ను గుర్తించి రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాద ప్రదేశాలలో సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రంబుల్ స్ట్రిప్స్, సైన్ బోర్డ్స్, విద్యుత్ దీపాలు, తదితర ఏర్పాట్లను చేయాలన్నారు. ప్రమాద స్థలాల్లో వాహనాల వేగ నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. తరచుగా ప్రమాదాలు జరుగుతున్న చోట్ల వాటికి గల కారణాలను విశ్లేషించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలల బస్సులు రోడ్డు భద్రత ప్రమాణాలు కలిగి ఉన్నాయా లేదా అని రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేయాలన్నారు. వాహనాల ఓవర్ లోడ్, పాఠశాలల బస్సుల తనిఖీల నివేదికను అందజేయాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. పోలీస్ అలాగే రవాణా శాఖ అధికారులు లారీ డ్రైవర్లతో, స్కూల్ బస్ డ్రైవర్లతో సమావేశం నిర్వహించి వాహనాలలో ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండేలా చూడాలని అలాగే ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు.మున్సిపాలిటీలో స్కూల్ జోన్ లాంటి ప్రాంతాలలో ఆటోలు,రిక్షాలు, క్యాబ్ డ్రైవర్లకు నెమ్మిదిగా వెళ్లేలా మున్సిపల్ కమిషనర్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.సాండ్ టాక్సీ, మైనింగ్ వాహనాలకు ఫిట్ నెస్ సర్టిఫికెట్ ఉంటేనే రేడియం స్టికర్ అతికించాలని, పరిశ్రమలకు చెందిన వాహనాల డ్రైవర్లకు సరిపడే నిద్ర ఉండేలా డ్యూటీ లు ఇచ్చేవిధంగా యాజమాన్యం తో మాట్లాడితో చాలా వరకు ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రోడ్డు ప్రమాదాలకి గురైన వారికి తక్షణమే చికిత్స అందించేందుకు 1.50 లక్షల రూపాయలు వారం రోజుల్లో సంబంధిత హాస్పిటల్ కు అందజేస్తుంది కాబట్టి రోడ్డు ప్రమాదాలలో క్షతగాత్రులకు వెంటనే చికిత్స చేయాలని హాస్పిటల్ యాజమాన్యులను కోరారు. రాత్రి పూట పశువులు, కుక్కలు రోడ్లపై సంచరించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని నివారించేందుకు తగ్గిన చర్యలు తీసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. జాతీయ రహదారులపై ఏమైనా ప్రమాదాలు జరిగితే వారికి ప్రథమ చికిత్స చేసి హాస్పిటల్ కు తరలించేందుకు అంబులెన్స్ అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.చిన్న చిన్న భద్రత ప్రమాణాలు పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించి ప్రాణాలను కాపాడినవారిమి అవుతామని ఇట్టి విషయాన్ని అధికారులు సామాజిక బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు ఈ సమావేశంలో వెబ్ ఎక్స్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఆర్డీవోలు, తాసిల్దార్ లు రవాణా శాఖ అధికారి, నేషనల్ హైవే సిబ్బంది, పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.తదుపరి డ్రగ్స్ నిర్మూలనపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మలకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లాలో మత్తు కలిగించే పదార్థాలైన అల్ప్రజోలం, డైజోఫామ్ (షెడ్యూల్ హెచ్ డ్రగ్ ) డ్రగ్స్ ను డాక్టర్ ప్రెస్క్రప్షన్ లేకుండ విక్రయించరాదని అలా విక్రయించిన మెడికల్ షాపులపై కేసులు నమోదు చేయాలని సంబంధిత డ్రగ్ ఇన్స్పెక్టర్ ను కలెక్టర్ ఆదేశించారు.

జిల్లాలో గుడుంబా, నాటు సారా అమ్మే గ్రామాలపై, ప్రాంతాలపై నిఘా పెట్టి అలాంటి వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల పరిసర ప్రాంతంలోని పాన్ షాపుల నిఘా పెట్టి పిల్లలకు ఎలాంటి మత్తు చాక్లెట్లు సిగరెట్లు, పాన్ పరాగ్ సరఫరా చేయకుండా చూడాలని, ప్రతి గురువారం పాఠశాలలో ప్రేయర్ టైం లో డ్రగ్స్ ఫ్రీ యాక్టివిటీస్ జరగాలని డి ఇ ఓ ను ఆదేశించారు. డ్రగ్స్ నిర్మూలనపై గ్రామాలలో మహిళా సంఘాలను భాగస్వామ్యం చేస్తూ ర్యాలీలు, అవగాహన సదస్సు నిర్వహించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఈ విధంగా డ్రగ్స్ ను పూర్తిగా నిర్మూలించి సూర్యాపేట జిల్లాను డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా ముందు వరుసలో ఉంచాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కే సీతారామారావు, అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ, డీఈఓ అశోక్, మహిళా శిశు సంక్షేమ అధికారి నరసింహారావు, రవాణా, ఎక్సైజ్, ఆర్ అండ్ బి అధికారులు, ఎన్ హెచ్- 65 అధికారులు వివిధ శాఖల అధికారులు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్ డైరీ, మీడియా ట్యాగులు ఆవిష్కరించిన డీఎస్పీ.



క్రైం కౌంటర్ న్యూస్ కోదాడ, మార్చి 09 ( గురునాథం జిల్లా బ్యూరో )

కోదాడ పట్టణంలోని డీఎస్పి శ్రీనివాస్ రెడ్డి,ఆర్డీవో సూర్యనారాయణ,వారి కార్యాలయాల్లో సోమవారం ప్రజా దర్బార్ డైరీ, మీడియా ట్యాగులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దినపత్రిక సమాజంలో ఒక శక్తివంతమైన సమాచార మాధ్యమంగా పనిచేస్తుందని, ప్రజల సమస్యలను, ప్రభుత్వానికి చేరవేయడంలో పత్రిక కీలక పాత్ర పోషిస్తుందన్నారు.ప్రభుత్వం తీసుకునే విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకువస్తూ,పరిష్కార దిశగా ముందడుగు వేస్తున్నా పత్రిక ప్రజా దర్బార్ దినపత్రిక అని వారు అన్నారు. మరియు మీడియా వారికి మీడియా ట్యాగ్లను వారి కందించి మంచి వార్త కథనాలు మంచి గుర్తింపు తేవాలని మీడియా మిత్రులకు తెలియపరిచారు ఈ కార్యక్రమంలో భాగంగా కోదాడ పట్టణ సీఐ శివశంకర్ నాయక్, తహసిల్దార్ వాజిద్ అలీ లను మర్యాదపూర్వకంగా కలిసి డైరీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా దర్బార్ జిల్లా స్టాపర్ బత్తిని కృష్ణమూర్తి, రిపోర్టర్ గడ్డం అంజి, మిట్టపల్లి శ్రీనివాస్, రహీం, అబ్బురం, ఫక్రుద్దీన్, నూరుద్దీన్, హరీష్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే శ్రీమతి ఉత్తమ్ పద్మావతి రెడ్డి కి ఘన సన్మానం.



క్రైం కౌంటర్ న్యూస్ కోదాడ, మార్చి 09 ( గురునాథం జిల్లా బ్యూరో )

కాపుగల్లు నుండి ద్వారకుంట గ్రామం వరకు రోడ్డును డబుల్ రోడ్డుగా శాంక్షన్ చేయించిన సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిని మాజీ డీసీసీబీ చైర్మెన్ ముత్తవరపు పాండురంగరావు సోమవారం ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో రెడ్లకుంట మాజీ సర్పంచ్ సాధినేని అప్పారావు , ద్వారకుంట సర్పంచ్ శ్రీ పాలకి సురేష్ , వనపర్తి రామయ్య, రాంబాబు, బ్రమ్మం, ఉపేందర్, కాపుగల్లు నుండి నల్లూరి రవి, నంబూరి లక్ష్మయ్య, పగిళ్ల రోషయ్య, నూకతోటి త్రినాధ్, ముత్యం వీరబాబు, కొండా సైదులు, చల్లా కొండా, ఎం మురళీ తదితరులు పాల్గొన్నారు.



## భారత్‌కు వరల్డ్ కప్ అందించిన కోచ్‌ను పట్టేసిన శ్రీలంక..



టీ20 ప్రపంచకప్ 2026లో దారుణ ప్రదర్శన చేసిన శ్రీలంక క్రికెట్ జట్టు.. ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తోంది. కొన్ని నెలలుగా జట్టుకు హెడ్ కోచ్‌గా ఉన్న జయసూర్య వైదొలగడంతో కొత్త కోచ్‌ను ఎంపిక చేసింది. టీమిండియాకు వన్డే ప్రపంచకప్ 2011 అందిన గ్యారీ కిర్‌స్టన్‌ను.. హెడ్ కోచ్‌గా నియమించింది. వన్డే ప్రపంచకప్ 2027 వరకు అతడే ఈ పోస్టులో ఉండనున్నాడు. భారత్‌తో పాటు టీ20 ప్రపంచకప్ 2026కు సంయుక్త ఆతిథ్యం ఇచ్చిన శ్రీలంక.. దారుణ ప్రదర్శన చేసింది. సెమీస్ కూడా చేరకుండానే సూపర్-8 దశ నుంచే నిష్క్రమించింది. ఈ నేపథ్యంలో ఆ జట్టు వచ్చే వన్డే ప్రపంచకప్ 2027పై ఫోకస్ చేసింది. ఇందులో భాగంగా టీమిండియాకు వన్డే ప్రపంచకప్ 2011 అందించిన దక్షిణాఫ్రికాకు చెందిన గ్యారీ కిర్‌స్టన్‌ను హెడ్ కోచ్‌గా నియమించింది. ఈ మేరకు సోమవారం అధికారికంగా ప్రకటన చేసింది.గత కొన్ని రోజులుగా శ్రీలంక క్రికెట్ దిగ్గజం సనత్ జయసూర్య.. శ్రీలంక హెడ్ కోచ్‌గా పనిచేశాడు. అతడి కోచింగ్‌లో ద్వైపాక్షిక సిరీస్‌లలో శ్రీలంక సత్తాచాటినా.. ఐసీసీ టోర్నీలో మాత్రం విఫలమైంది. తాజాగా టీ20 ప్రపంచకప్ 2026లో సూపర్-8 నుంచే నిష్క్రమించింది. ఎన్నో అంచనాలతో ఈసారి ఆ జట్టు బరిలో నిలిచింది. కానీ ఆశించిన ఫలితాలు సాధించకపోవడంతో జయసూర్య.. కోచ్ పదవికి రాజీనామా చేశాడు. దీంతో కొత్త కోచ్ ఎంపిక అనివార్యమైంది. కోచింగ్‌లో సుదీర్ఘ అనుభవమున్నగ్యారీ కిర్‌స్టన్ ఏప్రిల్ నుంచి లంక కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. రెండేళ్ల పాటు అతడు ఈ బాధ్యతల్లో ఉండనున్నాడు. వన్డే ప్రపంచకప్ 2027 వరకు అతడే లంక హెడ్‌కోచ్‌గా ఉండనున్నాడు. దక్షిణాఫ్రికాకు చెందిన గ్యారీ కిర్‌స్టన్ ఆటగాడిగా సత్తాచాటిన తర్వాత కోచింగ్ ఫీల్డ్‌లోకి వచ్చాడు 2011లో భారత జట్టు వన్డే ప్రపంచకప్ గెలవడంలో అతడిది కీలకపాత్ర. ఆ తర్వాత ఐపీఎల్‌లోనూ హెడ్ కోచ్‌గా అతడు బాధ్యతలు చేపట్టాడు. గుజరాత్ టైటాన్స్ ఐపీఎల్‌లో అడుగుపెట్టిన తొలి సీజన్‌లోనే విజేతగా నిలిచిందంటే.. అందుకు ప్రధాన కారణం గ్యారీ కిర్‌స్టన్. ఐపీఎల్‌లో కోచింగ్ తర్వాత గ్యారీ కిర్‌స్టన్.. పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు హెడ్ కోచ్ అయ్యాడు. అయితే అతడు సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవడంలో పాక్ విఫలమైంది. దీంతో కొన్ని రోజులకే అతడు బాధ్యతల నుంచి వైదొలిగాడు. ఇక టీ20 ప్రపంచకప్ 2026లో నమీబియా జట్టుకు కన్సల్టెంట్‌గా పని చేశాడు. తాజాగా శ్రీలంక క్రికెట్ జట్టుకు హెడ్ కోచ్ అయ్యాడు. గ్యారీ కిర్‌స్టన్.. సౌతాఫ్రికా తరఫున 101 టెస్టులు, 185 వన్డేలు ఆడాడు.

## ఫైనల్‌కి ముందు కుటుంబంలో విషాదం, దుఃఖాన్ని దిగమింగుకొని మరీ వరల్డ్‌కప్ ఆడిన ఇషాన్ కిషన్



టీ20 వరల్డ్ కప్ 2026 ఫైనల్‌కు రెండు రోజుల ముందు కుటుంబంలో జరిగిన విషాదాన్ని అధిగమించి ఇషాన్ కిషన్ అద్భుత ప్రదర్శన చేశాడు. కారు ప్రమాదంలో అతని కజిన్, బావ మృతి చెందడంతో కుటుంబం తీవ్ర షాక్‌లోకి వెళ్లింది. ఈ కారణంగా కిషన్ తండ్రి ఫైనల్ చూడడానికి అహ్మదాబాద్‌కు రాలేకపోయాడు. అయినప్పటికీ జట్టుకోసం ఫైనల్ ఆడిన కిషన్ 25 బంతుల్లో 54 పరుగులు చేసి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. హాఫ్ సెంచరీ తర్వాత ఆకాశం వైపు బ్యాట్ చూపిస్తూ తన కుటుంబాన్ని గుర్తు చేసుకున్నాడు. ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026 ఫైనల్‌లో భారత్ ఘన విజయం సాధించిన సందర్భంలో ఒక భావోద్వేగ ఘటన వెలుగులోకి వచ్చింది. వ్యక్తిగత జీవితంలో జరిగిన తీవ్ర విషాదాన్ని తట్టుకుని భారత ఆటగాడు ఇషాన్ కిషన్ జట్టుకోసం ఫైనల్ మ్యాచ్ ఆడాడు. ఫైనల్‌కు కేవలం రెండు రోజుల ముందు శుక్రవారం జరిగిన కారు ప్రమాదంలో కిషన్ కజిన్, అతని బావ మరణించారు. ఈ ఘటనతో కుటుంబం మొత్తం తీవ్ర షాక్‌కు గురైంది. ఈ విషాదం కారణంగా కిషన్ తండ్రి ప్రణవ్ పాండే అహ్మదాబాద్‌కు వెళ్లి ఫైనల్ మ్యాచ్ చూడలేకపోయాడు. ఫైనల్‌కు ముందు మీడియాతో మాట్లాడిన ఆయన తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశాడు. “అనర్థం జరిగింది. మేమంతా చాలా పెద్ద సమస్యలో ఉన్నాం” అని ప్రణవ్ పాండే తెలిపారు. కిషన్ కూడా కుటుంబాన్ని కలవాలని భావించినప్పటికీ టీ20 వరల్డ్ కప్ ఫైనల్ బాధ్యతల కారణంగా వెళ్లలేకపోయాడని ఆయన తెలిపారు. “మేమంతా షాక్‌లో ఉన్నాం. ఇషాన్ మా దగ్గరకు రావాలని అనుకున్నాడు. కానీ ఫైనల్ ఉండటంతో రాలేకపోయాడు. అతను చాలా బాధలో ఉన్నాడు” అని ప్రణవ్ పాండే చెప్పారు. ఈ ఘటన ప్రభావం కిషన్‌పై స్పష్టంగా కనిపించిందని కూడా రిపోర్ట్ పేర్కొంది. సాధారణంగా భారత జట్టు ప్రాక్టీస్ సెషన్‌లలో చాలా ఉత్సాహంగా కనిపించే కిషన్, ఈసారి మాత్రం నిశ్శబ్దంగా ఉన్నాడని సమాచారం. ప్రాక్టీస్ సమయంలో అతను సాధారణంగా చేసేంతసేపు బ్యాటింగ్ కూడా చేయలేదని తెలుస్తోంది. అతని పరిస్థితిని గమనించిన టీమిండియా ఆటగాళ్లు పలువురు అతని దగ్గరకు వెళ్లి భుజం మీద చేయి వేసి ధైర్యం చెప్పారు. అయితే ఈ వ్యక్తిగత విషాదం మధ్య కూడా కిషన్ ఫైనల్ మ్యాచ్‌లో అద్భుతంగా రాణించాడు. న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్లో నెంబర్ 3 స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన ఇషాన్ కిషన్ అద్భుతంగా ఆడాడు. కేవలం 25 బంతుల్లో 54 పరుగులు చేసి స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. ఈ ఇన్నింగ్స్‌లో అతని దూకుడు టీమిండియా భారీ స్కోర్ సాధించడంలో కీలక పాత్ర పోషించింది. హాఫ్ సెంచరీ పూర్తి చేసిన తర్వాత కిషన్ తన బ్యాట్‌ను ఆకాశం వైపు చూపించాడు. అది తన కుటుంబ సభ్యులను గుర్తు చేసుకుంటూ చేసిన భావోద్వేగ సంకేతంగా భావిస్తున్నారు. బ్యాటింగ్ మాత్రమే కాకుండా ఫీల్డింగ్‌లో కూడా అతను కీలక పాత్ర పోషించాడు. అవుట్‌ఫీల్డ్‌లో అద్భుతంగా క్యాచ్‌లు పట్టి న్యూజిలాండ్ బ్యాటర్లు రచిన్ రవీంద్ర, టిమ్ సైఫర్ట్‌లను అవుట్ చేశాడు. మొత్తం టోర్నమెంట్‌లో కిషన్ మంచి ఫామ్‌లో కనిపించాడు. తొమ్మిది ఇన్నింగ్స్‌లలో మొత్తం 317 పరుగులు చేసి టోర్నమెంట్‌లో నాలుగో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. వ్యక్తిగతంగా ఎంతటి బాధ ఉన్నా జట్టుకోసం తన బాధ్యతను నిర్వర్తించిన ఇషాన్ కిషన్ ప్రదర్శన అభిమానులను భావోద్వేగానికి గురిచేసింది.

# కొడుకు పెళ్లి బిజీలోనూ భారత క్రికెట్ జట్టుపై ప్రేమ..



సచిన్ టెండుల్కర్.. క్రికెట్ గురించి తెలిసిన వారికి పరిచయం అక్కర్లేని పేరు. పసి వయసు నుంచే క్రికెట్‌ను ప్రాణంగా ప్రేమించి.. ఆటతోనే శిఖరాలను అధిరోహించిన సచిన్.. కోట్లాది మంది అభిమానులకు ఆరాధ్య దైవం. యువ ఆటగాళ్లకైతే సచిన్ మాట వేదవాక్కు. భారత క్రికెట్ ఇప్పుడు ఈ స్థాయికి చేరుకుందంటే.. దానికి ప్రధాన కారణాల్లో సచిన్ ఒకడు. అలాంటి సచిన్ ఆట నుంచి తప్పుకొని 12 ఏళ్లు దాటుతున్నా సరే.. ఆటగాళ్లకు తన వంతు సాయం చేస్తూనే ఉన్నాడు. సచిన్ టెండుల్కర్ .. క్రికెట్ చరిత్రలోనే అత్యంత గొప్ప ఆటగాళ్లలో ఒకడు. భారత క్రికెట్‌లోనైతే సచిన్ దేవుడితో సమానం. గంగూలీ, ద్రవిడ్, ధోనీ, కోహ్లి, రోహిత్.. ఇలా ఎందరో గొప్ప ఆటగాళ్లు వచ్చి ఉండొచ్చు. కానీ సచిన్ స్థానాన్ని ఎవరూ టచ్ చేయలేరు. బడికెళ్లే వయసులోనే భారత జట్టులో చోటు సంపాదించుకున్న సచిన్.. సుదీర్ఘంగా 24 ఏళ్లపాటు క్రికెట్ ఆడటంతోపాటు.. ఎన్నో రికార్డులు నెలకొల్పాడు. 2013లోనే క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన ఈ మాస్టర్ బ్లాస్టర్.. ఇప్పటికీ భారత జట్టుతో తన అనుబంధాన్ని కొనసాగిస్తున్నాడు. ఆటగాళ్లు ఎవరైనా బాగా ఆడితే ఎక్స్ వేదికగా పోస్టులు చేసి వారిని అభినందించడం సచిన్‌కు అలవాటు. యువ క్రికెటర్లలో దాగి ఉన్న టాలెంట్‌ను పసిగట్టడంలో సచిన్ తర్వాతే ఎవరైనా. టెండుల్కర్ సిఫారసుతోనే ధోనీకి కెప్టెన్సీ దక్కగా.. ఆ తర్వాత వెంటనే అతడి నాయకత్వంలోని భారత జట్టు తొలి టీ20 వరల్డ్ కప్ గెలిచిన సంగతి తెలిసిందే. అంతేకాదు చాలా మంది యువ బ్యాటర్లు తమ టెక్నిక్‌ను మెరుగుపర్చుకోవడానికి, మానసికంగా బలంగా ఉండేందుకు, ఒత్తిడిని తట్టుకొని ఆటపై ఫోకస్ చేయడానికి ఇప్పటికీ సలహాల కోసం సచిన్‌ను సంప్రదిస్తుంటారు. దీంతో సచిన్ కూడా వారికి కాదనకుండా సూచనలు, సలహాలు ఇస్తుంటాడు. టీ20 వరల్డ్ కప్ 2026లో మూడు నాకౌట్ మ్యాచ్‌ల్లో 80కిపైగా పరుగులతో.. సంజూ శాంసన్ భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి.. ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ అవార్డును అందుకునే సమయంలో సచిన్ గొప్పతనం గురించి సంజూ శాంసన్ అందరికీ చెప్పేశాడు. తాను సరిగా ఆడలేకపోతున్నప్పుడు.. సలహాలు అవసరం అనిపించి సచిన్‌ను సంప్రదించానని సంజూ చెప్పాడు. గత రెండు నెలలుగా సచిన్‌తో నిరంతరం టచ్‌లో ఉన్నానని.. ఆయనతో సుదీర్ఘ మంతనాలు జరిపానని సంజూ చెప్పాడు. సచినల్ లాంటి వ్యక్తి నుంచి సలహాలు పొందడానికి మించి ఎవరికైనా ఏం కావాలి? అని శాంసన్ తన ఆటతీరులో వచ్చిన మార్పు గురించి.. ప్రశ్న రూపంలోనే సమాధానం తెలిపాడు. వాస్తవానికి సచిన్ క్రికెట్ నుంచి రిటైరయ్యా కూడా చాలా బిజీగా గడుపుతున్నారు. బిజినెస్, సోషల్ సర్వీస్, మెంటార్షిప్, క్రీడలకు ప్రోత్సాహం అందించడం లాంటి వ్యాపకాలతో ఆయన తీరిక లేకుండా ఉంటున్నారు. అదీ గాక ఇటీవలే సచిన్ టెండుల్కర్ కుమారుడు అర్జున్ టెండుల్కర్ పెళ్లి కూడా అయ్యింది. అయినా సరే తీరిక చేసుకొని మరీ సంజూ శాంసన్‌కు సచిన్ సలహాలు, సూచనలు ఇచ్చాడు. ఫైనల్‌కు ముందు కూడా సచిన్ సర్ తనతో మాట్లాడారని సంజూ చెప్పుకొచ్చాడు. గతంలో ఎన్ని అవకాశాలు వచ్చినా సరిగా వాడుకోలేకపోయిన సంజూ.. టీ20 వరల్డ్ కప్ లాంటి మెగా వేదికపైన.. వరుసగా మూడు నాకౌట్ మ్యాచ్‌ల్లో సత్తా చాటాడు. దీనికి కారణం.. అతడి ఆటతోపాటు దృక్పథంలో వచ్చిన మార్పు. దీని కారణమైన వ్యక్తి మాత్రం క్రికెట్ గాడ్ సచిన్ టెండుల్కర్. అదీ భారత క్రికెట్ పట్ల, యువ ఆటగాళ్లను తీర్చిదిద్దడం పట్ల ఆయనకున్న ప్రేమ.

# 10 ట్రోఫీలు గెలవాలి': హార్దిక్ పాండ్యా



టీమిండియా వరుసగా రెండోసారి టీ20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన భవిష్యత్ గురించి మాట్లాడాడు. తాను ఇంకా కనీసం 10 ఏళ్లు భారత జట్టుకు ఆడాలని, ఈ కాలంలో మరిన్ని ఐసీసీ ట్రోఫీలు గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నానని చెప్పాడు. ఇప్పటివరకు తన కెరీర్ సగమే పూర్తయ్యిందని, మిగిలిన కాలంలో కనీసం 10 ట్రోఫీలు గెలవాలని ఆశిస్తున్నానని వెల్లడించాడు. ఈ విజయానికి తన గర్ల్‌ఫ్రెండ్ మహీకా శర్మ కూడా ప్రేరణగా నిలిచిందని తెలిపాడు. ఈ రెండు టీ20 వరల్డ్‌కప్‌లలో హార్దిక్ పాండ్యా కీలక పాత్ర పోషించాడు. ఈ నేపథ్యంలో స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన భవిష్యత్ లక్ష్యాలను వెల్లడించాడు. ఇంకా కనీసం పదేళ్లు భారత జట్టుకు ఆడాలని, ఆ కాలంలో మరిన్ని ఐసీసీ ట్రోఫీలు గెలిచి జట్టుకు అందించాలని సంకల్పం వ్యక్తం చేశాడు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఫైనల్లో సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని టీమిండియా న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో భారత్ మూడోసారి టీ20 వరల్డ్ కప్‌ను గెలుచుకుంది. అంతేకాదు, స్వదేశంలో ఈ టోర్నమెంట్‌ను గెలిచిన తొలి జట్టుగా నిలిచింది. అలాగే టైటిల్‌ను విజయవంతంగా డిఫెండ్ చేసిన తొలి జట్టుగా కూడా చరిత్ర సృష్టించింది. 2026 టీ20 వరల్డ్ కప్‌లో హార్దిక్ రెండు హాఫ్ సెంచరీలు చేయడంతో పాటు తొమ్మిది వికెట్లు కూడా తీశాడు అహ్మదాబాద్‌లో విజయం అనంతరం హోస్ట్ బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన హార్దిక్ తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. “ఇప్పుడు నేను జట్టులో సీనియర్ ప్లేయర్ అని వినిపించడం చాలా బాగుంది. కానీ నా దగ్గర ఇంకా పదేళ్ల క్రికెట్ మిగిలి ఉంది. ఇప్పటివరకు నా కెరీర్‌లో సగం మాత్రమే పూర్తయింది. ఇంకా సగం మిగిలే ఉంది. మొత్తంగా ఐసీసీ, ఐపీఎల్ కలిపి కనీసం మరో పది ట్రోఫీలు గెలవాలని నేను కోరుకుంటున్నాను” అని హార్దిక్ అన్నాడు. “నేను ఏ టోర్నమెంట్ ఆడినా గెలవాలనే ఆలోచనతోనే మైదానంలోకి దిగుతాను. వచ్చే పదేళ్లలో కచ్చితంగా ఐదు లేదా ఆరు ట్రోఫీలు అయినా గెలుస్తాను. ఓటమి గురించి నేను ఎప్పుడూ ఆలోచించలేదు. ఈ విజయానికి దేవుడికి ధన్యవాదాలు” అని హార్దిక్ చెప్పాడు. ఈ సందర్భంగా తన వ్యక్తిగత జీవితంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి గురించి కూడా హార్దిక్ ప్రస్తావించాడు. తన గర్ల్‌ఫ్రెండ్ మహీకా శర్మ గురించి మాట్లాడుతూ ఆమె తన జీవితంలోకి వచ్చిన తర్వాత విజయాలు వరుసగా వస్తున్నాయని చెప్పాడు. “మహీకా నా జీవితంలోకి వచ్చిన తర్వాత నేను వరుసగా విజయాలు సాధిస్తున్నాను. నేను ఎప్పటినుంచో ఎదురు చూసిన విజయం ఇదే. అందుకే నేను క్రికెట్ ఆడుతున్నాను. ట్రోఫీలు గెలవడమే నా లక్ష్యం. ఎంత ఎక్కువ ట్రోఫీలు గెలిస్తే అంత మంచిది. 2024లోనే నేను ఒకసారి చెప్పాను, నేను ఆడే ప్రతి ట్రోఫీని గెలుస్తానని. నాకు ఇప్పటికీ ఆ నమ్మకం ఉంది” అని హార్దిక్ పేర్కొన్నాడు.




# పెళ్లి తర్వాత స్పీడ్ పెంచిన విజయ్ దేవరకొండ..



రౌడీ హీరో విజయ్ దేవరకొండ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం 'రౌడీ జనార్ధన్', 'రణబాలి' చిత్రాల షూటింగ్‌లో పాల్గొంటున్న ఆయన మరో కొత్త సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. 'హాయ్ నాన్న' దర్శకుడు శౌర్యువ్ చెప్పిన కథకు విజయ్ ఓకే చెప్పినట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ కెవిఎన్ ప్రొడక్షన్స్ నిర్మించనుందని తెలుస్తోంది. ప్రస్తుతం కథా చర్చలు కొనసాగుతున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన యాటిట్యూడ్‌తో రౌడీ స్టార్‌గా గుర్తింపు పొందాడు విజయ్ దేవరకొండ . ఇటీవలే రష్మిక మందానాతో వివాహ బంధంలోకి అడుగుపెట్టిన ఆయన వరుస కార్యక్రమాలతో తీరిక లేకుండా గడిపారు. ఉదయ్‌పూర్‌లో వివాహం తర్వాత మొదట సొంత ఊరిలో కుటుంబ సభ్యులు, బంధువుల మధ్య సత్యనారాయణ వ్రతం చేసుకుని ఊరంతా భోజనాలు పెట్టారు. అనంతరం హైదరాబాద్‌లో సినీ ప్రముఖులు, స్నేహితుల కోసం ప్రత్యేకంగా గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు పలువురు సినీ ప్రముఖులు హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుకలు ముగియడంతో విజయ్ దేవరకొండ మళ్లీ తన సినిమా పనుల్లో బిజీ అవుతున్నారు. ప్రస్తుతం విజయ్ దేవరకొండ రెండు చిత్రాలతో బిజీగా ఉన్నారు. అందులో ఒకటి 'రౌడీ జనార్ధన్', మరొకటి 'రణబాలి'. ఈ రెండు సినిమాలు ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్నాయి. తాజాగా విజయ్ మరో చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దర్శకుడు రవి కిరణ్ కోలా తెరకెక్కిస్తున్న 'రౌడీ జనార్ధన్' ఒక రూరల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇందులో విజయ్ దేవరకొండ సరసన కీర్తి సురేష్ కథానాయికగా నటిస్తున్నారు. 1980ల కాలాన్ని నేపథ్యంగా తీసుకుని ఈ కథ సాగనుందని తెలుస్తోంది. ఈ సినిమాలో విజయ్ దేవరకొండను తొలిసారిగా గోదావరి యాసలో మాట్లాడించే ప్రయత్నం చేస్తున్నామని చిత్రబృందం చెబుతోంది. మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా 2026 డిసెంబరులో విడుదల కానుంది. ఈ చిత్రంపై అభిమానుల్లో ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. ఇక మరోవైపు దర్శకుడు రాహుల్ సాంకృత్యాయన్ తెరకెక్కిస్తున్న 'రణబాలి' చిత్రంలో కూడా విజయ్ దేవరకొండ నటిస్తున్నారు. ఇందులో హీరోయిన్‌గా రష్మిక మందానా నటిస్తోంది. పెళ్లి తర్వాత వీరిద్దరు కలిసి నటిస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలున్నాయి. ఇటీవల విడుదల చేసిన టీజర్, ఫస్ట్ సింగిల్ మూవీపై అంచనాల్ని అమాంతం పెంచేశాయి. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రానికి సంబంధించిన కొత్త షెడ్యూల్ ఈ నెల 12వ తేదీ నుంచి కర్నూల్‌లో ప్రారంభం కానుంది. ఆ షెడ్యూల్‌లో విజయ్ దేవరకొండ పాల్గొననున్నారని తెలుస్తోంది. భారీ యాక్షన్ ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ సినిమా కూడా ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇదిలా ఉండగా విజయ్ దేవరకొండ మరో కొత్త ప్రాజెక్ట్‌కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. 'హాయ్ నాన్న' సినిమాతో గుర్తింపు పొందిన దర్శకుడు శౌర్యువ్ చెప్పిన కథకు విజయ్

# దివ్య భారతి ట్రెండీ లుక్‌లో



కోలీవుడ్ గ్లామర్ బ్యూటీ దివ్య భారతి తన లేటెస్ట్ ఫోటోషూట్‌తో సోషల్ మీడియాలో మరోసారి సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. 'బ్యాచిలర్' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌డమ్ తెచ్చుకున్న ఈ భామ, ప్రస్తుతం దక్షిణాది సినీ పరిశ్రమలో అత్యంత వేగంగా ఎదుగుతున్న కథానాయికలలో ఒకరిగా నిలిచింది. తాజాగా ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పోస్ట్ చేసిన ట్రెండీ లుక్ ఫొటోలు నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి. ఈ ఫొటోలలో దివ్య భారతి తనదైన శైలిలో గ్లామర్ మరియు ఎలిగెన్స్‌ను మేళవించి సరికొత్త ఫ్యాషన్ గోల్స్ సెట్ చేస్తోంది. ముఖ్యంగా ఆమె ధరించిన స్టైలిష్ అవుట్‌ఫిట్ ఆమె పర్ఫెక్ట్ కర్వ్స్‌ను ఎలివేట్ చేస్తూ కుర్రకారు గుండెల్లో సెగలు పుట్టిస్తోంది. వైవిధ్యమైన భంగిమల్లో కెమెరాకు ఫోజులిస్తూ తన కిల్లింగ్ లుక్స్‌తో అభిమానులను మైమరపిస్తోంది. ఈ ఫొటోలు షేర్ చేసిన కొద్ది నిమిషాల్లోనే లక్షలాది లైకులు, వేల సంఖ్యలో కామెంట్లతో నెట్టింట వైరల్‌గా మారాయి. ఆమె ఫాలోయర్లు "అందానికే అసూయ పుట్టేలా ఉన్నావు", "ట్రెండీ క్వీన్" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. కోలీవుడ్‌లో బిజీగా ఉంటూనే, తెలుగులోనూ సుడిగాలి సుధీర్ సరసన '+.నా.నా.ం' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర పోస్టర్లు మరియు ప్రచార చిత్రాల్లో ఆమె లుక్ చూసి తెలుగు ప్రేక్షకులు కూడా ఫిదా అయిపోయారు. కేవలం వెండితెరపైనే కాకుండా, సోషల్ మీడియాలో నిరంతరం యాక్టివ్‌గా ఉంటూ తన లేటెస్ట్ అప్‌డేట్స్‌ను షేర్ చేయడం దివ్య భారతికి అలవాటు. ఈ క్రమంలోనే తాజాగా ఆమె పోస్ట్ చేసిన ఈ స్టన్నింగ్ ఫొటోలు నెట్టింట ట్రెండింగ్‌లో నిలుస్తున్నాయి. ఆమె ఫ్యాషన్ సెన్స్ మరియు కాన్ఫిడెంట్ అప్పియరెన్స్ చూస్తుంటే, రాబోయే రోజుల్లో ఈ భామ సౌత్ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్‌గా నిలవడం ఖాయమని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంమీద దివ్య భారతి తన లేటెస్ట్ ట్రెండీ లుక్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తూ గ్లామర్ డోస్‌ను అమాంతం పెంచేసింది. ఈ గ్లామర్ విందు కేవలం ఫొటోలకే పరిమితం కాకుండా, దివ్య భారతి తన అద్భుతమైన ఫ్యాషన్ సెన్స్‌తో యువతకు స్టైల్ ఐకాన్‌గా మారుతోంది. ఈమె ధరించిన దుస్తుల ఎంపిక, హెయిర్ స్టైల్ మరియు మినిమల్ మేకప్ ఆమె సహజ సిద్ధమైన అందాన్ని మరింతగా ద్విగుణీకృతం చేస్తూ ఫోటోలకు నిండుతనాన్ని చేకూర్చాయి. ముఖ్యంగా కెమెరా వైపు ఆమె చూస్తున్న తీరు, ఆ కళ్ళలోని గాంభీర్యం చూస్తుంటే ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే. సోషల్ మీడియా వేదికగా ఈమె పోస్ట్ చేసే ప్రతి అప్‌డేట్ క్షణాల్లో వైరల్ అవుతూ, డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్ పై ఈమెకు ఉన్న క్రేజ్ ఏంటో నిరూపిస్తోంది. కోలీవుడ్‌లో తక్కువ సమయంలోనే తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న ఈ సుందరాంగి, ఇప్పుడు టాలీవుడ్ ప్రేక్షకులను కూడా తన మాయలో పడేసేందుకు సిద్ధమైంది. సినిమా అవకాశాల పరంగా చూస్తే, గ్లామర్ పాత్రలకే కాకుండా నటనకు ప్రాధాన్యత ఉన్న వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ తన కెరీర్ గ్రాఫ్‌ను పక్కాగా ప్లాన్ చేసుకుంటోంది. సుడిగాలి సుధీర్ సినిమాతో తెలుగులోకి అడుగుపెడుతున్న వార్త విన్నప్పటి నుండి, ఇక్కడి ప్రేక్షకులు కూడా ఆమె స్క్రీన్ ప్రెజెన్స్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజా ఫోటోషూట్‌లో ఆమె కనబరిచిన కాన్ఫిడెన్స్ చూస్తుంటే, పెద్ద హీరోల సినిమాల్లో నటించేందుకు ఈమె సర్వసిద్ధంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. కేవలం ఫోటోషూట్లతోనే కాకుండా, తన ఫిట్‌నెస్ మరియు డైట్ విషయంలో కూడా ఎంతో శ్రద్ధ వహించే దివ్య భారతి, అద్భుతమైన ఫిజిక్‌ను మెయింటైన్ చేస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఈ ట్రెండీ లుక్స్‌తో ఆమె కేవలం ఒక నటిగానే కాకుండా, ఫ్యాషన్ ప్రపంచంలో తనకంటూ ఒక బ్రాండ్ ఇమేజ్‌ను సృష్టించుకుంటోంది. రాబోయే రోజుల్లో పెద్ద ప్రాజెక్టుల ప్రకటనలు వెలువడే అవకాశం ఉండటంతో, ఈ భామ క్రేజ్ మరింత పెరగడం ఖాయం. మొత్తానికి దివ్య భారతి తన లేటెస్ట్ గ్లామర్ అటాక్‌తో నెటిజన్ల మనసు దోచుకుంటూ, ట్రెండింగ్ లిస్టులో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

# OG రికార్డును 'ధురంధర్ 2' బ్రేక్






రణవీర్ సింగ్ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్ 2' రిలీజుకు ముందే బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. మార్చి 19న విడుదల కానున్న ఈ చిత్రం, పెయిడ్ ప్రివ్యూల ద్వారా అప్పుడే రూ.18 కోట్ల అడ్వాన్స్ బుకింగ్స్ సాధించింది. ఎటువంటి టికెట్ రేట్ల పెంపు లేకపోయినా, కేవలం హిందీ వెర్షన్ నుంచే రూ.12 కోట్లు వసూలు చేయడం ఈ చిత్రంపై ఉన్న క్రేజ్‌కు నిదర్శనం. ఇప్పటికే హిందీలో 'స్త్రీ 2' రికార్డ్ బ్రేక్ చేసింది. ఈ క్రమంలో పవన్ కళ్యాణ్ 'హ+' పేరిట ఉన్న పెయిడ్ ప్రివ్యూ కలెక్షన్స్ రికార్డును 'ధురంధర 2' సినిమా అధిగమించే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ ఏడాది మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా సినిమాలలో 'ధురంధర్ 2' ఒకటి. రణవీర్ సింగ్ హీరోగా నటించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ ఇది. 'ధురంధర్' సీక్వెల్ గా, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం కోసం యావత్ సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మార్చి 19న ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ అవ్వగా.. ఆన్ లైన్లో టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. ఈ క్రమంలో సరికొత్త రికార్డులు నమోదవుతున్నాయి. గతేడాది డిసెంబర్ లో రిలీజైన 'ధురంధర్' సినిమా బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఒక సాధారణ యాక్షన్ థ్రిల్లర్‌లా థియేటర్లలోకి వచ్చి, అసాధారణ వసూళ్లతో రికార్డులు సృష్టించింది. బాక్సాఫీస్ వద్ద రూ.1300 కోట్లకు పైగా కలెక్షన్స్ సాధించింది. 2025లో అత్యధిక గ్రాస్ రాబట్టిన చిత్రంగా నిలిచింది. దీంతో రెండో భాగం 'ధురంధర్: ది రివెంజ్' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. దానికి తగ్గట్టుగానే అడ్వాన్స్ బుకింగ్స్ జరుగుతున్నాయి. 'ధురంధర్ 2' సినిమాని హిందీతో పాటుగా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయనున్నారు. ఒకరోజు ముందుగానే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. మార్చి 18న పెయిడ్ ప్రివ్యూల పేరుతో ప్రత్యేక షోలు ప్రదర్శిస్తున్నారు. నిన్న ఒక్క రోజే 80 వేలకు పైగా టికెట్లు అమ్ముడయ్యాయి. ఇప్పటివరకూ 2 లక్షలకు పైగా టికెట్లు బుక్ అయినట్లు తెలుస్తోంది. దీంతో పది రోజుల ముందుగానే అడ్వాన్స్ బుకింగ్స్ రూపంలో రూ.18 కోట్ల కలెక్షన్స్ రాబట్టి సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసిందని ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి.

Owned by Katikala Vara Prasad,Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Banka Indira . at D.no. 465 Le out no2. Dodleru Road. Ysr jagananna colony. Krosuru.Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/2015/62250. Ph:9849707349 email:kvp6858@gmail.com